మహమ్మారికి మెరుగైన వైద్యం

పెరుగుతున్న క్యాన్సర్ తీవ్రతకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోంది. క్యాన్సర్ రోగులకు ఉచిత చికిత్స ఇవ్వడానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింతగా విస్తరించారు. ఈ వార్డుకు అవసరమైన పరికరాలను మంజూరు చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

- ప్రభుత్వ చొరవతో అన్ని రకాల క్యాన్సర్లకు చికిత్స
- ఆరోగ్యశ్రీ ద్వారా 729 క్యాన్సర్లకు ఉచిత వైద్యం
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం


కేజీహెచ్ ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులు

మహారాణిపేట : ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం కాలుష్యం, ఆహారపు అలవాట్లు, ధూమపానం వల్ల క్యాన్సర్ సోకుతోంది. గతంలో పొగ తాగే వారికి మాత్రమే సోకే లంగ్ క్యాన్సర్ ఇప్పుడు అనేక మందికి సోకుతోంది. జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్న ప్రజలు లివర్ క్యాన్సర్‌కు గురి అవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ప్రతి ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం క్లోజ్ ది కేర్ గ్యాప్ అనే థీమ్‌తో ముందుకు వస్తోంది. గత మూడు సంవత్సరాల నుంచి వస్తున్న ఈ థీమ్ ఈ ఏడాదితో ముగుస్తుంది. కేజీహెచ్‌లో ఉన్న క్యాన్సర్ యూనిట్‌కు ఒక వైపు వైద్యుల నియామకం, మరో వైపు అవసరమైన వైద్య పరికరాలు సమకూరుస్తున్నారు. రూ. 43 కోట్ల వ్యయంతో లీనాక్ వైద్య పరికరం కేజీహెచ్‌కు మంజూరు చేశారు. స్వీడన్ నుంచి ఇది వస్తోంది. ఎక్కడైతే క్యాన్సర్ ఉందో ఆదే ఏరియాలో నేరుగా రేడియేషన్ ఇవ్వడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. ఇంటర్ ఆఫ్ ఆల్ట్రా సౌండ్ పరికరం కూడా కేజీహెచ్‌లో ఉంది. ఈ పరికరం ద్వారా సర్జికల్ అంకాలజీతో వైద్య సేవలు అందిస్తారు. ఇంకా పిల్లల క్యాన్సర్లు, బ్లడ్ క్యాన్సర్లకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆరోగ్యశ్రీకి పెద్ద పీట

ఏపీలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా క్యాన్సర్ చికిత్స అందిస్తున్నారు. మెడికల్ అంకాలజీలో 304, సర్జికల్ అంకాలజీలో 368, రేడియేషన్ అంకాలజీలో 57 ప్రొసీజర్లకు ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా అందజేస్తున్నారు. మొత్తం 180 పడకల్లో మెడికల్ అంకాలజీ 90 పడకలు, సర్జికల్ అంకాలజీలో 30 పడకలు, రేడియేషన్ అంకాలజీలో 60 పడకలను సర్కార్ ఏర్పాటు చేసింది.

గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం ఔట్ పేషెంట్లు (ఓపీ) 7817 మంది, ఇన్ పేషెంట్లు (ఐపీ) 3882 మంది, కీమోథెరపీ 4657 మంది, సర్జరీలు 461 మందికి చేశారు.

జిల్లాలో పెరుగుతున్న కేసులు

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి బాధితులు చికిత్స కోసం విశాఖ వస్తున్నారు. కేజీహెచ్‌తో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా క్యాన్సర్‌కు చికిత్స అందించాలని నిర్ణయించారు. దీనికి అవసరమైన పరికరాలు, వైద్యుల నియామకం జరుగుతోంది. గతంలో 1500 నుంచి రెండు వేల వరకు కేసులు వచ్చేవి. ఇప్పుడు ఏడాదికి 12 వేల నుంచి 15 వేల వరకు వస్తున్నాయి.

మనోధైర్యమే మందు..



ప్రస్తుతం కేజీహెచ్‌లో వారానికి ఆరు రోజుల పాటు ఓపీ పర్యవేక్షణ జరుగుతోంది. సోమవారం, బుధవారం, శుక్రవారం మెడికల్ అంకాలజీ విభాగాధిపతి (హెచ్‌ఓడీ) ఆధ్వర్యంలో ఓపీ నిర్వహిస్తున్నాం. 125 నుంచి 150 మంది వరకు బాధితులు వస్తున్నారు. హేమటో అంకాలజీ, పీడియాట్రిక్ అంకాలజీ, పల్లేలిటివ్ కేర్ వార్డు ప్రారంభించాం. క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదు. మనోధైర్యంతో ముందుకు నడవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది.
– డాక్టర్ కె. శిల్ప, క్యాన్సర్ వైద్యురాలు, కేజీహెచ్

తొలిదశలో గుర్తిస్తే నివారించవచ్చు



తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారణ చేయడానికి వీలు ఉంటుంది. క్యాన్సర్ నిర్ధారణతో పాటు శారీరక, మానసిక క్షోభకు వైద్యం అందిస్తే మనిషి జీవన ప్రమాణం పెరుగుతుంది. ఆత్మ విశ్వాసం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చు. నేడు క్యాన్సర్‌కు ఎన్నో ట్రీట్‌మెంట్లు ఉన్నాయి. జంక్ ఫుడ్, కొలెస్ట్రాల్‌తో కూడిన ఆహారం, ఉబకాయం వల్ల క్యాన్సర్ సోకుతుంది. వ్యాయమం చేయడం, ధైర్యంగా ఉండడం మంచిది.
– డాక్టర్ బెల్లాల రవిశంకర్, అంకాలజిస్టు, ఎండీ, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి

మహిళా కళాశాలలో క్యాన్సర్ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడారు. ప్రధానంగా వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, వాటి లక్షణాలు, నివారణోపాయాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని బడుగు, బలహీన వర్గాలకు అవగాహన కల్పించాలన్నారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి ఎ. జ్యోతి, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ టి. వరలక్ష్మి, అధ్యాపకుడు డాక్టర్ డి. లక్ష్మన్నాయుడు పాల్గొన్నారు.

జెడ్సీకి అభినందనలు

మహారాణిపేట : జీవీఎంసీ జోన్-4 కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.సన్యాసినాయుడును గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులు అభినందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ అందరం కలిసి జోన్‌ను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్. భార్గవ్, గణేష్ కుమార్, బి.వి.అశోక్‌కుమార్, కిషోర్, మురళి, నారాయణరావు, రాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంకల్ప సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న మామిడి శ్రీనివాస్, జల్లి రాజశేఖర్

సీతమ్మధార : అంబేడ్కర్ ఆశయ సాధనకు, జాతి విముక్తికి సమర శంఖం పూరించాలని ఏఐఎం జిల్లా ఇన్‌చార్జి మామిడి శ్రీనివాసరావు, జల్లి రాజశేఖర్ పిలుపునిచ్చారు. దొండపర్తి కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన ఏఐఎం (అంబేడ్కర్ ఇండియన్ మిషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి. సునీల్‌కుమార్ (ఐపీఎస్) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జరగనున్న దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మధ్య కాలంలో పి.వి.సునీల్‌కుమార్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిసి దళిత వాడ పంచాయతీలకి అనుకూలంగా జీవో విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. దళిత కోటాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ పదవులు పొందిన వారు దళితుల అభివృద్ధి కోసం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వాళ్ల స్వార్థాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రాజు, లంకా శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, ఆర్.నారాయణరావు, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు టికెట్ ఇచ్చే పార్టీనే గెలిపిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న మున్నీర్

డాబాగార్డెన్స్ : ముస్లింలకు ఏ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని మక్కా మసీదు అధ్యక్షుడు షేక్ మున్నీర్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలున్నాయని, 1994లో ఎస్ఏ రెహ్మాన్, 1972లో ముస్లిం నేత గెలిచారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 25 వేల మంది ముస్లింలు ఉన్నారని చెప్పారు. ప్రధాన పార్టీలు ముస్లింలకు టిక్కెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా రంగంలో దించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. సమావేశంలో ముస్లిం నాయకులు జమీల్ అహ్మద్, సనావుల్లా, అబ్దుల్ రహీమ్, అజీజ్, అహ్మద్ తుల్లా, రవూఫ్, జియాల ఉల్‌హన్, రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు అందజేస్తున్న శ్రీహరిరెడ్డి, ఉడ్‌యార్డ్ సచివాలయ సిబ్బంది

అల్లిపురం : ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డుల పరిమితిని రూ. 25 లక్షలకు పెంచారు. ఈ సందర్భంగా కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారులకు సచివాలయాల పరిధిలో వలంటీర్ల సహకారంతో అందజేస్తున్నారు. దీంట్లో భాగంగా ఉడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయంలో శనివారం కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను ఏఎన్ఎం తులసి, ఆశ వర్కర్ నాగజ్యోతి, వలంటీర్లు గంగుల మానస, రామలక్ష్మిలతో కలిసి వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి అందజేశారు.

9 నుంచి ఉచిత యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థూలకాయ నివారణకు ఈ శిబిరం 8 వారాల పాటు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 6–7 గంటల వరకు 7.15 నుంచి 8.15 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఆసక్తి గల వారు 91678 89881 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో గల వార్డు ప్రజలకు మౌలిక వసతులతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అందివ్వడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్-4 పరిధి 30, 37 వార్డుల పరిధిలోని తాడివీధి, ఫిషింగ్ హార్బర్ రోడ్డులో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, చెన్నా జానకీ రామ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. 30వ వార్డు తాడివీధిలో సుమారు రూ.78 లక్షల వ్యయంతో కల్యాణ మండపం నిర్మాణానికి, 37వ వార్డు ఫిషింగ్ హార్బర్ రోడ్డులో రూ.1.90 లక్షల వ్యయంతో బరియల్ గ్రౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల జీవీఎంసీ నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులు జోడించి అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు జగనన్న ప్రభుత్వం కల్పిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన బాలుడు


కుటుంబ సభ్యుల వద్దకి చేరుకున్న నానాబస (పసుపు రంగు టీషర్టు వేసుకున్న అబ్బాయి)

అల్లిపురం : అస్సాం రాష్ట్రం, కోర్బి అంగ్లాంగ్ జిల్లా, నైలాలాంగ్ తాలుకా, మారుమూల డిలాంగి గ్రామానికి చెందిన నానాబాస మతి స్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించేవాడు. గత డిసెంబర్ 20వ తేదీన అతను గాంగ్‌టక్ వచ్చి రైలెక్కి విశాఖపట్నం చేరు కున్నాడు. దీంతో ఆర్పీఎఫ్ పోలీసులు టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి సమాచారం ఇవ్వడంతో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి అతన్ని తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి మానసిక వైద్య శాలలో చికిత్స అందించిన తర్వాత అతని ఇంటి అడ్రస్ తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో పూణేకు చెందిన శ్రద్ధా ఫౌండేషన్ వారి ద్వారా అతని అక్కబావ వివరాలు తెలుసుకుని డిపూ జిల్లా లో ఉన్న మంజా గ్రామానికి తీసుకెళ్లి క్షేమంగా అప్పగించారు.

హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మహారాణిపేట : తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం కేజీహెచ్ మార్చురీ వద్ద రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గంటా మీడియాతో మాట్లాడారు. ఈ దాడులపై ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రమణయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. పార్టీ కార్పొరేటర్ మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో మరింత సులువుగా విద్యాభ్యాసం


ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో పుష్పరాగం, రాము, రమేష్ తదితరులు

ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులకు రెండవ విడత పంపిణీ

అల్లిపురం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అందిస్తున్న ట్యాబ్‌ల ద్వారా పాఠాలు మరింత సులభంగా అర్థమవుతాయని మహారాణిపేట ఉప విద్యాశాఖాధికారి పుష్పరాగం అన్నారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆమెతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్ తదితరులు పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. ప్రముఖ జ్యూయలరీ సంస్థ జోస్ ఆలుకాస్ ప్రతినిధులు పాఠశాల అభివృద్ధికి రూ.3.2 లక్షలు ప్రధానోపాధ్యాయుడికి చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంజీఎం హైస్కూలు అభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తున్న జోస్ అలుక్కాస్ ప్రతినిధులు

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : ఈనెల 4న ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ, కేజీహెచ్ రేడియాలజీ విభాగం, అంకాలజీ డిపార్టుమెంట్ సంయుక్తంగా గర్భాశయ ముఖద్వార కాన్సర్‌పై శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిబాబు మాట్లాడుతూ పలు రకాల క్యాన్సర్లు ఇటీవల కాలంలో సోకుతున్నాయన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ గర్భా శయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ నేపథ్యంలో 9 నుంచి 14 ఏళ్ల ఆడపిల్లలకు ఉచిత వ్యాక్సిన్ వేయించేందుకు చైతన్య స్రవంతి ముందుకొచ్చిందన్నారు.ఈ వ్యాక్సిన్ రెండు సార్లు వేస్తారని, వివాహం అయిన వారికి మూడుసార్లు వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ఇందుకయ్యే ఖర్చును చైతన్య స్రవంతి భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంకాలజిస్ట్ డాక్టర్ కుమారి, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం


33వ వార్డులో బాధితుడికి సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి పది మందికి రూ.5 వేలు చొప్పున రూ.50 వేలు అందజేశారు. 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్టకు చెందిన మిద్ది రమణమ్మ, అగ్రహారపు రాము, పాత్రో వరప్రసాద్, 31వ వార్డుకు చెందిన కొసన రమేష్, 30వ వార్డులో మల్లిపల్లి కృష్ణవేణి, నొళ్ల నాగరాజు, గరికిన గోపి, కుర్మాదాస్ ఎల్లయ్య, 38వ వార్డుకు చెందిన మరిసా అప్పారావు, 39వ వార్డు ఫెర్రీరోడ్డుకు చెందిన గంగిరి సత్తమ్మలకు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్డులు పరిశుభ్రంగా ఉంచాలి


వార్డు ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు


కులగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

జగదాంబ : వార్డులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ సన్యాసినాయుడు అన్నారు. శనివారం జోనల్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడారు. రహదారులపై చెత్తకుప్పలు ఉండకూడదన్నారు. అవసరమైన చోట సిబ్బందిని ఏర్పాటు చేసుకుని పరిశుభ్రత పాటించాలన్నారు. క్లాప్ వాహనాలను సెక్రటరీ లు పర్యవేక్షించాలన్నా రు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సహకరించాలి

ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ బి.సన్యాసినాయుడు అన్నారు. శనివారం జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించిన ఆయన సెక్రటరీలతో కలిసి కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కులగణనలో 15 రకాల వివరాలు పొందుపరచాలన్నారు. ఇందుకు సెక్రటరీలు స్వయంగా వస్తున్నారన్నారు. ఇప్పటి వరకు జోన్ పరిధిలో 81.5 శాతం నమోదు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ రక్షణకు పారిశ్రామిక సమ్మె

డాబాగార్డెన్స్ : దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, బీఎస్ఎన్ఎల్ రక్షణకు ఈ నెల 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మెలో సంస్థ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుందని ఆరోపించారు. బీఎస్ఎన్ఎల్‌కు 4జి, 5జి కేటాయించకుండా ప్రైవేట్ కంపెనీ రిలయన్స్‌కు కేటాయించడం దుర్మార్గమన్నారు. బీఎస్ఎన్ఎల్ ఆస్తులు నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైప్‌లైన్ పేరిట ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందన్నారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాజు, అష్రఫ్, రామాంజనేయులు, ప్రసాద్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వ్యాకులమాత మహోత్సవం

- జ్ఞానాపురం నుంచి కొత్తవలస కొండ డాబాలకు పాదయాత్ర
- వేలాదిగా పాల్గొన్న భక్తులు


వ్యాకులమాత విగ్రహం


వ్యాకుల మాత తేరుతో భక్తుల పాదయాత్ర ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం : విశాఖ అతి మేత్రాసనం, పారిష్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండ డాబాలకు చెందిన వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 4 ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండ డాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన దేవాలయంలో వేర్వేరుగా చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం జరగనున్న ఈ పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్రాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్‌బాబు, జి. శ్యామలరావు, స్వర్ణలత తదితరులు పనులు పర్యవేక్షించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర.. : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకలో భాగంగా వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి, కొత్తవలస వరకు పాదయాత్ర చేపట్టారు. భక్తి గీతాలు ఆలపిస్తూ సందడిగా పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో పలువురు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజనం, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు. సాయంత్రానికి భక్తులు కొండ డాబాల వద్ద గల ఉత్సవ వేదికకు చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విచారణ కర్తలు, గురువులు, కన్య స్త్రీలు, మఠవాసులు, భక్తులు, పాదయాత్రలో పాల్గొన్నా రు.


భక్తులకు అల్పాహారం అందజేత

భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు..

వివిధ ప్రాంతాల నుంచి వేదికకు చేరే భక్తుల కోసం ఉత్సవ ప్రాంగణంలో తాత్కాలిక వసతి సదుపాయం కల్పిస్తున్నారు. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు జ్ఞానాపురం నుంచి నేరుగా కొత్తవలస కొండ డాబాలకు ఆర్టీసీ బస్సుల సదుపాయం కల్పించారు.